సింగిల్ పేజీ కథ

# సబ్బు బిళ్ళ

**-ఆనందరావు**

చాలా రోజుల తర్వాత మా ఇంటికి బంధువు వచ్చాడు. ఆయన మరెవ్వర్రోకాదు స్వయానా మా మామగారే. ఆవిడ తరపున ఆత్మబంధువులు కాబట్టి. మా శ్రీమతి, పిల్లలు మహా సంతోషంగా ఉన్నారు.

నాకు వళ్ళుమండి, వేడెక్కి బాత్రూంలో దూరాను.

సోపుకేసులో సగానికిపైగా అరిగిపోయిన సబ్బుంది.

మళ్ళీ బయటికొచ్చి స్టోర్రూమ్‌లో దూరి కొత్త సబ్బు ఒకటి తీసుకొని, రేపరు విప్పి సోపుకేసులో పెట్టాను.



అరిగిపోయిన సబ్బుతో స్నానం చేశాను. దీనికో ఫ్లాష్ బ్యాక్ ఉంది.

మా మామగారికి తామర ఉండేది. చాలా ట్రీట్‌మెంటు తర్వాత తగ్గిందన్నారు. కాని తామర తగ్గిందంటే నేను నమ్మను. తామరకీ డబ్బుకీ అవినాభావ సంబంధ ముందంటారు.

మా మామగార్కి పుష్కలంగా డబ్బుంది. కాబట్టి తామర ఆయన ఒంట్లో కాపురం పెట్టి ఉంటుందనే నా ప్రగాఢవిశ్వాసం.

డబ్బుంటే తీపిగాని తామరంటే తెగ చిరాకు నాకు.

ఆయన ఉన్నన్నాళ్ళూ అరిగిపోయిన సబ్బుతోనే ఒళ్ళు రుద్దుకొని కాలం గడిపేయడానికి నిర్ణయించుకున్నాను.

మూడ్రోజులు ముచ్చటగా గడిచాయి. మా మామగారు వెళ్తాననీ, మా ఆవిడేమో ఉండమనీ పోరు.

ఏది ఏమైనా ఆయన ఉన్నన్నాళ్ళూ మా ఆవిడ గారెలూ, ఆవడలూ, పులిహోర, చక్కెరపొంగళి చేసి పెడ్తూండేది. అతిథిదేవునితో పాటు నాకూ అవి దక్కేవి.

మొత్తంమీద ఆయన తను మరొక్క రోజు మాత్రమే ఉంటానని ఫైనల్ గా చెప్పేశారు.

అతగాడి టికెట్ రిజర్వేషన్‌కోసం వెళ్ళమని మ శ్రీమతి అర్డర్‌పాస్ చేసింది. ఇక తప్పదు గురుడా! అని బాత్రూంలో దూరాను.

ఆశ్చర్యం... ఇడ్లీ సైజు ఉన్న నా సబ్బు అరిగిపోయి రూపాయి కాసంత అయిపోయింది.

"సరూ! సరూ!" అని కేకేసాను.

"ఏమిటీ?..." అంటూ రాగాలు తీస్తూ వచ్చింది అర్థాంగి.

"ఘరొక సబ్బులేదా! నా సబ్బేమో అరిగిపోయింది" అన్నాను.

"మీ సబ్బేమిటి? ఆ కొత్త సోపు అలానే ఉందేమి చెప్మా," అంది మా ఆవిడ బూరెల్లాంటి బుగ్గలు నొక్కుకుంటూ.

ఆ బుగ్గలు చూసే నేను పెళ్ళి చేసుకున్నాను సరోజని. కాని ఇప్పుడు మాత్రం ఆవిడ వ్యవహారం చూస్తూంటే మండుకొస్తుంది.

"ఆ కొత్త సబ్బు మీ బాబుకోసం!... ఇది నా సబ్బు-బాగా అరిగిపోయింది." అన్నాను కసిగా.

"అరె ఇన్నాళ్ళూ నేనూ ఆ పాత సబ్బుతోనే సరిపెట్టుకొన్నాను సుమండీ" అందామె.

"మమ్మీ! మేం కూడా అదే సబ్బు వాడాం!" అన్నారు మా పిల్లలిద్దరూ కోరస్‌గా.

వాళ్ళందరికళ్ళలో తామరమీద ఎలర్జీ కన్పడుతోంది.

బాత్రూంలో ఏం జరుగుతోందో తెలియని మామగారు వచ్చి...

"ఏమిటర్రా గొడవ!" అని నాచేతిలో సబ్బుచూసి.

"నాయనా రామం! ఆ అరిగిపోయిన సబ్బు మాత్రం పారేయకు సుమా! ఈ మూడ్రోజులూ బాగా పనికొచ్చింది నాకు!" అన్నారు.

అప్పుడు చూడాలి వాళ్ళ కళ్ళలో!... నాకేమో ఒళ్ళు జలదరించి... దరించి... చించి...

ఆనందరావ్
ఇ.ఎమ్.ఆర్. డివిజన్,
రాయఘడ్ - 765 002.

★